సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 28 । సెప్టెంబర్ । 2022

వంజంగి హిల్స్‌కు పర్యాటకుల తాకిడి



సాక్షి,పాడేరు: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన మేఘాల కొండ వంజంగి హిల్స్‌కు మంగళవారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. దసరా సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలకు చెందిన పర్యాటకులు, విద్యార్థులు వంజంగి హిల్స్ ప్రాంతానికి చేరుకుని సూర్యోదయంతో పాటు మంచు, మేఘాలను చూసి పరవశించారు. ఉదయం 10గంటల వరకు పర్యాటకులు తాకిడి ఎక్కువగా ఉంది.

చింతూరు ఏరియా ఆస్పత్రిలో ప్లేట్‌లెట్ పరీక్షలు

చింతూరు: రక్తంలో ప్లేట్‌లెట్ల సంఖ్యను నిర్ధారించే పరీక్షను స్థానిక ఏరియా ఆస్పత్రిలో అందుబాటులోకి తెచ్చినట్టు చింతూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య మంగళవారం తెలిపారు. కూనవరం, ఎటపాక, వీఆర్‌పురం, చింతూరు మండలాల ప్రజలు ఇక్కడ పరీక్ష చేయించుకోవచ్చన్నారు.

న్యూస్‌రీల్

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో రమేష్

అరకులోయ: ఏకలవ్య మోడల్ పాఠశాలల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. స్థానిక గిరిజన గురుకుల క్రీడా పాఠశాలలో రెండవరోజు పోటీలను మంగళవారం డీఈవో డాక్టర్ పి.రమేష్ ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. రాష్ట్రంలోని 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి సుమారు 700 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. హ్యాండ్‌బాల్, షటిల్ బాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఆర్చరీ, పరుగుపందెం తదితర పోటీలు జరిగాయి. పోటీల నిర్వహణకు గురుకుల క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ పి.ఎస్.ఎన్. మూర్తి, కోచ్‌లు సహకరిస్తున్నారు. బుధవారం సాయంత్రంతో పోటీలు ముగుస్తాయి. చివరి రోజు అన్ని క్రీడలకు సంబంధించి ఫైనల్ పోటీలు జరుగుతాయని, ప్రతిభ చూపిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తామని గిరిజన క్రీడల అధికారి ఎస్.శ్యామ్‌సుందర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పరుగు పోటీల్లో సచివాలయం ఉద్యోగి ప్రతిభ



కొర్రా గోపి

అనంతగిరి: రాష్ట్రస్థాయి పరుగు పోటీల్లో మండలానికి చెందిన సచివాలయం ఉద్యోగి ప్రతిభ కనబరిచారు. గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో మంగళవారం రాష్ట్రస్థాయి పరుగు పోటీలు జరిగాయి. మండలంలోని రొంపల్లి సచివాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కొర్రా గోపి 10కె, 5కె పోటీల్లో పాల్గొని ప్రథమస్థానంలో నిలిచారు. పాడేరు కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

108లో ప్రసవం



బిడ్డను చూపిస్తున్న 108 సిబ్బంది

పాడేరు రూరల్: 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఓ గర్భిణి ప్రసవించింది. హుకుంపేట మండలం బాకూరు పంచాయతీ గంగుడి గ్రామానికి చెందిన గెమ్మెలి గంగాభవానీ నిండు గర్భిణి. మంగళవారం మధ్యాహ్నం ఆమెకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది ఆమెను హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యంలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. దీంతో 108 సిబ్బంది వాహనాన్ని ఆపి ఆమెకు సుఖప్రసవం చేశారు. తల్లీబిడ్డను అదే వాహనంలో హుకుంపేట ఆస్పత్రికి తరలించారు.

శాయ్ అకాడమీకి మధుచందన



చింతూరు: స్టేట్ లెవల్ ఖేలో ఇండియా సెంటర్ ఏలూరులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్) అకాడమీకి చింతూరుకు చెందిన వెయిట్‌లిఫ్టర్ గుత్తుల మధుచందన తూర్పు గోదావరి జిల్లా తరఫున ఎంపికైంది. పదో తరగతి చదువుతున్న చింతూరుకు చెందిన మధుచందన రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరచడం ద్వారా పలు పతకాలు సాధించింది. ఇప్పటివరకు రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో 8 బంగారు, 10 కాంస్యం, 5 రజత పతకాలను సాధించడంతో ఆమె ప్రతిభను గమనించిన అధికారులు అకాడమీకి ఎంపిక చేశారు. దీంతో మధుచందన ఇకపై శాయ్ అకాడమీ ద్వారా విద్య కొనసాగించడంతో పాటు అక్కడే శిక్షణ పొంది వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొననుంది. మధుచందన ఎంపిక పట్ల కోచ్ గంగాధర్, తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

విచ్చలవిడిగా రంగురాళ్ల తవ్వకాలు

- విలువైన క్యాట్ ఐ రకం రాళ్లు లభ్యం
- డబ్బుపై ఆశతో ప్రాణాలకు తెగిస్తున్న గిరిజనులు
- మూడు క్వారీల వద్ద వ్యాపారుల మకాం
- భారీగా వ్యాపారం



జి.మాడుగుల మండలం కూటికొండలు ప్రాంతంలో రంగురాళ్ల క్వారీ



సిగినాపల్లి ప్రాంతంలో నిఘా కోసం వినియోగిస్తున్న డ్రోన్ కెమెరా

సాక్షి,పాడేరు: జిల్లాలో మళ్లీ రంగురాళ్ల తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. జీకే వీధి మండలం సిగినాపల్లి క్వారీని నెలరోజుల కిందట పోలీసులు మూసివేయించారు. దీంతో అంతర రాష్ట్ర రంగురాళ్ల వ్యాపారుల ముఠాలు వేరే క్వారీలపై దృష్టి సారించాయి. జి.మాడుగుల మండలంలోని మారుమూల గడుతూరు పంచాయతీ కూటికొండలు, ఇదే క్వారీకి సమీపంలోని చింతపల్లి సరిహద్దు నిట్టాపుట్టు అటవీ ప్రాంతంలోను, అడ్డతీగల మండలం తపస్వికొండ అటవీ ప్రాంతంలోను రంగురాళ్ల క్వారీలు వెలుగు చూశాయి. ఆయా క్వారీల వద్ద వ్యాపారులు మకాం వేసి, గిరిజనులను ప్రోత్సహిస్తుండడంతో విచ్చలవిడిగా తవ్వకాలు జరుగుతున్నాయి.

విశాఖ, రాజమహేంద్రవరాల్లో విక్రయాలు

కొంతమంది వ్యాపారులు పాడేరు, వి.మాడుగుల, నర్సీపట్నం మండలాల్లో మకాం వేసి, రంగురాళ్ల తవ్వకాలను ప్రోత్సహిస్తున్నట్టు సమాచారం.

స్థానికంగా రంగురాళ్లను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు వాటిని నేరుగా విశాఖపట్నం, రాజమహేంద్రవరం ప్రాంతాలకు తరలించి అక్కడ ఉన్న పెద్ద వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వాటిని జాతీయ,అంతర్జాతీయ మార్కెట్‌లకు పెద్ద వ్యాపారులు తరలిస్తున్నారు.

జి.మాడుగుల మండలం కూటికొండలు, అడ్డతీగల మండలం తపస్వికొండపై గల క్వారీల్లో విలువైన క్యాట్ ఐ రకం(పిల్లి కన్ను రంగు) రంగురాళ్లు లభ్యమవుతున్నాయని తెలిసింది. కూటికొండలు రంగురాళ్ల క్వారీ వద్దకు మైదాన ప్రాంతాల్లోని వి.మాడుగుల, రావికమతం, జి.మాడుగుల మండలాలకు చెందిన వ్యాపారులు రోజూ వెళుతూ పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. అత్యంత మారుమూల ప్రాంతం కావడంతో వ్యాపారులు యథేచ్ఛగా తవ్వకాలు జరిపిస్తున్నారు. ప్రమాదం అని తెలిసినప్పటికీ డబ్బు ఆశతో గిరిజనులు లోతుగా తవ్వుతున్నారు. తపస్వి కొండపై కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అడ్డతీగల ప్రాంతానికి చెందిన కొంతమంది స్థానిక వ్యాపారులే అక్కడ రంగురాళ్ల తవ్వకాలను ప్రోత్సహిస్తూ అక్కడ సేకరించిన వాటిని రాజమహేంద్రవరం, విశాఖపట్నానికి తరలిస్తు పెద్ద మొత్తంలో వ్యాపారం చేస్తున్నారు.

రంగురాళ్ల తవ్వకాలను నిరోధిస్తాం



జి.కె.వీధి మండలంలో సిగినాపల్లి వద్ద రంగురాళ్ల క్వారీని పూర్తిగా మూసివేశాం. డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేశాం. కూటికొండలు, తపస్వికొండల వద్ద తనిఖీలు నిర్వహించి వెంటనే ఆయా క్వారీలను కూడా మూసివేస్తాం. రంగురాళ్ల తవ్వకాలు, వ్యాపారాన్ని పూర్తిగా నిరోధించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రంగురాళ్ల వ్యాపారుల ముఠాల సంచారంపై దృష్టి పెడతాం. కొండలపై తవ్వకాలు జరిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నాం. తవ్వకాలను ఎవరైనా ప్రోత్సహిస్తే తమకు సమాచారం ఇవ్వాలి.

–సతీష్‌కుమార్, ఎస్పీ, అల్లూరి సీతారామరాజు జిల్లా

'గిరి గ్రామదర్శిని'కి పర్యాటక అవార్డు ప్రదానం

పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా నుంచి అందుకున్న అధికారులు



పాడేరు ఐటీడీఏ ఏపీవో, ఇతర అధికారులను అభినందిస్తున్న గత ఐటీడీఏ పీవో, తిరుపతి కలెక్టర్ డి.కె.బాలాజీ



పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా చేతుల మీదుగా అవార్డును స్వీకరిస్తున్న ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, మ్యూజియం మేనేజర్ మురళి

సాక్షి,పాడేరు: ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరకులోయలోని పెదలబుడు గిరి గ్రామదర్శినికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ యూనిక్ పర్యాటక ప్రాజెక్టు అవార్డు లభించింది. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలో నిర్వహించిన కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కే రోజా చేతుల మీదుగా ఈ అవార్డును పాడేరు ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, అరకులోయ గిరిజన మ్యూజియం మేనేజర్ మురళి మంగళవారం అందుకున్నారు. గత ఐటీడీఏ పీవో, ప్రస్తుత తిరుపతి కలెక్టర్ డి.కె.బాలాజీ ఆధ్వర్యంలో గిరి గ్రామదర్శిని నిర్మించారు. గిరి గ్రామదర్శినికి అవార్డు రావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అవార్డు స్వీకరించేందుకు వచ్చిన ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, గిరిజన మ్యూజియం మేనేజర్ మురళీలను ఆయన అభినందించారు.

విద్యాశాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

సాక్షి, పాడేరు : జిల్లాలో మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థంగా అమలు చేసే లక్ష్యంతో ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ విభాగాన్ని ఏర్పాటు చేస్తూ అందులో పలు పోస్టులను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై భర్తీ చేయనున్నట్టు డీఈవో పి.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ పోస్టుకు గౌరవ వేతనం రూ.25వేలు చెల్లిస్తామని ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ/పీజీతో పాటు పాఠశాల విద్యాశాఖ/ఇంటర్ విద్యాశాఖలో పనిచేసిన పరిపాలన నైపుణ్యం కలిగి ఉండాలన్నారు.

రిటైర్ అయిన సంచాలకులు, పర్యవేక్షకులు లేదా ప్రధానోపాధ్యాయులు ఈ పోస్టులకు అర్హులని తెలిపారు. కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని పేర్కొన్నారు. డేటా అనలిస్ట్ పోస్టుకు సంబంధించి ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సైన్సు నుంచి డిగ్రీ/పీజీతో పాటు డేటా విశ్లేషణాంశాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని, ఈ పోస్టుకు రూ.25వేలు గౌరవ వేతనం చెల్లిస్తామని తెలిపారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు నెలకు రూ.18,500 వేతనం చెల్లిస్తామని, ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి కంప్యూటర్ సైన్సు డిగ్రీ, తెలుగు, ఆంగ్ల భాషలో టైపింగ్ నైపుణ్యం కలిగిన వారు ఈ పోస్టుకు అర్హులని ఆయన పేర్కొన్నారు.

ప్రోగ్రాం కోఆర్డినేటర్, డేటా అనలిస్ట్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టును ఔట్‌సోర్సింగ్‌లో నియమిస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖ అధికారి పేరిట బయోడేటా ఫారం, పాస్‌ఫోటోలు, విద్యార్హతలు, ఇతర ధ్రువపత్రాలను జతచేసి వాటిపై గెజిటెడ్ అధికారి సంతకం చేయించి, అక్టోబర్ 4వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా అందజేయాలని డీఈవో సూచించారు. ఎలాంటి సందేహాలున్నా తమ కార్యాలయం పనివేళల్లో, 8309994622, 9441328097 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని డీఈవో తెలిపారు.

మళ్లీ కుండపోతగా వర్షాలు



పాడేరులో వర్షం కురుస్తున్న దృశ్యం



ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటుతున్న బుంగాపుట్టు గిరిజనులు

సాక్షి,పాడేరు/ముంచంగిపుట్టు/రాజవొమ్మంగి: జిల్లాలో మళ్లీ భారీ వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజుల నుంచి కుండపోతగా వర్షాలు కురుస్తుండడంతో ప్రధాన గెడ్డలు, వాగుల్లో వరద ఉధృతి ఎక్కువగా ఉంది. మంగళవారం మధ్యాహ్నం పాడేరులో సుమారు గంట పాటు భారీ వర్షం కురవడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. ముంచంగిపుట్టు, పెదబయలు, హుకుంపేట, జి.మాడుగుల, జి.కె.వీధి ప్రాంతాల్లో కూడా వర్షం కురిసింది.

పొంగిపొర్లుతున్న గెడ్డలు

ముంచంగిపుట్టు మండలంలో లక్ష్మీపురం పంచాయతీ కేంద్రం నుంచి బుంగాపుట్టు వెళ్లే మార్గంలో ముంతగుమ్మీ, బిర్రిగూడ, దొరగూడ,కర్లాపోదర్ గెడ్డలు వరద నీటితో ఉధృతంగా ప్రవాహిస్తున్నాయి. లక్ష్మీపురం, బుంగాపుట్టు పంచాయతీలకు చెందిన 16 గ్రామాల గిరిజనుల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. కుమడ నుంచి బూసిపుట్టు వెళ్లే రహదారి బురదమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.సరిహద్దులో కురుస్తున్న వర్షాలకు మత్స్యగెడ్డలోకి భారీగా వరదనీరు చేరుతుంది. రాజవొమ్మంగి మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. రాజవొమ్మంగి - అప్పలరాజుపేట గ్రామాల మధ్య పిసినికి కాలువ పొంగి ప్రవహించింది.ఇటీవల కల్వర్టు నిర్మించడంతో కాలువ దాటేందుకు ప్రజలకు ఇబ్బంది తప్పింది. మండలంలో పలు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయని, ఎక్కడా అవాంఛనీయ సంఘటను చోటు చేసుకోలేదని స్థానిక తహసీల్దార్ వై.వి. సుబ్రహ్మణ్యాచారి తెలిపారు.

మూడు క్లస్టర్లుగా పర్యాటక ప్రాంతాలు

- టూరిస్ట్ స్పాట్లలో పకడ్బందీగా ప్లాస్టిక్ నిషేధం
- టెంట్ల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి
- నిబంధనలు ఉల్లంఘిస్తే పర్యాటకులపై చర్యలు
- కలెక్టర్ సుమిత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్, వేదికపై ఐటీడీఏ పీవో, సబ్‌కలెక్టర్, చింతపల్లి ఏఎస్పీ

సాక్షి, పాడేరు: జిల్లాలో పర్యాటక ప్రాంతాలను సందర్శించే వారు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో రెవెన్యూ, పోలీసు అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, విద్యుత్, అగ్నిమాపక అధికారులు, రిసార్టుల నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. పర్యాటక ప్రాంతాల నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చింతపల్లి, పాడేరు, అరకులోయ పర్యాటక ప్రాంతాలను మూడు క్లస్టర్‌లుగా విభజించి లంబసింగి రోడ్డులోని డొనూరు, పాడేరు మండలం గరికిబంద, అనంతగిరి మండలం చిలకలగెడ్డ వద్ద టూరిజం చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తామన్నారు. పర్యాటకుల వాహనాలను తనిఖీ చేసి, వాహనాల్లో మద్యం బాటిళ్లు, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ బాటిళ్లు, సీసాలు, కవర్లు ఉంటే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సౌండ్‌సిస్టమ్‌లు పెట్టి స్థానికులకు ఇబ్బంది పెట్టకూడదని, ఆయా ప్రాంతాల్లో తనిఖీలకు అవసరమైన సిబ్బందిని కూడా నియమిస్తామని చెప్పారు. అక్రమంగా మద్యం విక్రయించే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెడతామన్నారు. టెంట్లు ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని, మద్యం పట్టుబడితే టెంట్ నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, వారి లైసెన్సులు రద్దు చేసి కేసు నమోదు చేస్తామన్నారు. పర్యాటకుల వివరాలన్నీ రిజిస్టర్‌లో నమోదు చేయాలని, గుర్తింపు కార్డులు, ఆధార్‌కార్డుల వివరాలను సేకరించాలని, మండల స్థాయిలో అధికారులు సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

టెంట్‌ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

టెంట్‌ల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, నిర్దేశించిన రుసుం మాత్రమే వసూలు చేయాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. టెంట్‌ల నిర్వాహకులు ట్రేడ్ లైసెన్సు పొందాలని, అత్యవసర మందుల కిట్లు, అగ్నిప్రమాదాల నివారణ పరికరాలు ఏర్పాటుచేయాలన్నారు. ప్రభుత్వ, అటవీ భూముల్లో టెంట్లు వేయడానికి వీల్లేదని చెప్పారు.

మైనర్‌లకు టెంట్లు ఇస్తే చర్యలు తప్పవు

పర్యాటక ప్రాంతాలను సందర్శించే మైనర్లకు టెంట్లు ఇస్తే యజమానులతో పాటు సంబంధిత పర్యాటకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చింతపల్లి ఏఎస్పీ కె.ప్రతాప్ కిషోర్ హెచ్చరించారు. రిసార్టులు, హోటళ్లు, టెంట్ నిర్వాహకులు సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ వి.అభిషేక్, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలకు రోజూ తాజా కూరగాయలు

సరఫరా చేయాలని ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు రోజూ తాజా కూరగాయలు సరఫరా చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. ఐటీడీఏ సమావేశం హాల్‌లో మంగళవారం ఏపీవో శ్రీనివాసరావుతో కలిసి ఏటీడబ్ల్యూవోలు, జీసీసీ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ సకాలంలో నిత్యావసర సరకులు, చికెన్, పాలు, గుడ్లను హాస్టల్‌కు చేరవేసే బాధ్యత సంబంధిత కాంట్రాక్టర్‌దేనని చెప్పారు. వీటి సరఫరాకు మూడు నెలలకు ఒకసారి టెండర్లు పిలుస్తున్నట్టు తెలిపారు. ప్రతీ ఆశ్రమ పాఠశాలలో రికార్డులు పక్కాగా నిర్వహించాలని, విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే దగ్గరలోని ఉన్న ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్య సేవలందించాలని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కాస్మోటిక్స్‌కు సంబంధించిన నగదు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్టు చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేయాలని, ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఇతరులను లోపలికి అనుమతించరాదని పీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవోలు తులసి,హాసిని, నాగజ్యోతి, శాంతి, డీఎస్‌వో బి.ఎస్. కుమార్,బి. కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు 150 రోజుల పనిదినాలు

చింతపల్లి రూరల్: ఆర్‌వోఎఫ్‌ఆర్ భూములు కలిగిన ఉపాధి కూలీలకు 150 రోజుల పాటు పనిదినాలు కల్పించాలని డ్వామా పీడీ రమేష్ ఆదేశించారు. మండలంలోని తాజంగి,గొందిపాకల పంచాయతీల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఆ పంచాయతీల్లో సాగుచేస్తున్న ఉద్యానవన పంటలను పరిశీలించారు. అనంతరం మండలకేంద్రంలోని మండల పరిషత్ సమావేశమందిరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగులతో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా పంపిణీ చేస్తున్న మొక్కలు రైతులు సకాలంలో నాటుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ ఎల్.రామారావు, చింతపల్లి,జీకే వీధి, కొయ్యూరు, పాడేరు ఏపీవోలు శెట్టి కొండబాబు, రాంప్రసాద్, రాజు, సీవో ఉదయ్ పాల్గొన్నారు.

అరకు పర్యాటకుల కోసం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): దసరా సెలవుల నేపథ్యంలో అరకు పర్యాటకుల కోసం ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం–అరకు మధ్య అక్టోబరు 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు స్పెషల్ రైలును నడిపేందుకు సిద్ధమైంది. ఈ స్పెషల్ రైలు (08509) ప్రతీ రోజు ఉదయం 8.30 గంటలకు విశాఖలో బయల్దేరి మధ్యాహ్నం 11.30 గంటలకు అరకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ స్పెషల్ రైలు(08510) అరకులో ప్రతీ రోజు మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి సాయంత్రం 6 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు 5–స్లీపర్‌క్లాస్, 7–సెకండ్ క్లాస్, 2–సెకండ్ క్లాస్ కమ్ లగేజీ కోచ్‌లతో నడుస్తుంది. ఈ రైళ్లు ఇరు మార్గాల్లో సింహాచలం, కొత్తవలస, బొర్రాగుహలు స్టేషన్‌లలో ఆగుతాయి.

ముగిసిన మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వార్షికోత్సవాలు

ఏవోబీ ప్రశాంతం



చత్తీస్‌గఢ్‌లో ర్యాలీగా వెళుతున్న గిరిజనులు

సాక్షి,పాడేరు: మావోయిస్టు పార్టీ 18వ ఆవిర్భావ వార్షికోత్సవాలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. వార్షికోత్సవాలను భగ్నం చేసేందుకు పోలీసులు తీసుకున్న చర్యలు ఫలించాయి. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడ్డుకట్ట వేయగలిగారు. ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు వార్షికోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఏవోబీ మావోయిస్టు నేత గణేష్ పిలుపు ఇచ్చారు. దీంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఒడిశా, ఆంధ్రా పోలీసు ఉన్నతాధికారులు సంయుక్తంగా ఏవోబీ వ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించారు. కూంబింగ్ పార్టీలు గాలింపు విస్తృతం చేశాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి అన్ని మండలాల్లో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. ఎస్పీ సతీష్‌కుమార్, ఒడిశాలోని కోరాపుట్, మల్కన్‌గిరి ఎస్పీలతో ఎప్పటికప్పుడు సమీక్షించి ఏవోబీ వ్యాప్తంగా గాలింపు చర్యలను విస్తృతం చేశారు. సరిహద్దులో ఒడిశా రాష్ట్రం కొసంగిపుట్టు వద్ద డంప్, దొరపుట్టు సమీపంలో మందుపాతరలను పోలీసులు గుర్తించి వాటిని బయటకు తీశారు. ఏవోబీ వ్యాప్తంగా ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకపోవడంతో పోలీసులు, ఏజెన్సీ వాసులు ఊపిరిపీల్చుకున్నారు.

చత్తీస్‌గఢ్‌లో సభలు ..?

మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వార్షికోత్సవాల సందర్భంగా ఒడిశా, ఆంధ్రా ప్రాంతాలకు సరిహద్దులో ఉన్న చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఓ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు బహిరంగ సభలు నిర్వహించినట్టు వీడియోలు వెలుగు చూశాయి. అయితే పోలీసుల నిఘా అధికంగా ఉండడంతో ఏవోబీలో మాత్రం మావోయిస్టులు ఆవిర్భావ వారోత్సవానికి దూరమై సురక్షిత ప్రాంతాలకే పరిమితమయ్యారు.

రెగ్యులేటర్ డ్యాంలో మరమ్మతులు

ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ ప్రశాంత్‌కుమార్



సీలేరు: స్థానిక జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తికి నీటిని పంపించే రెగ్యులేటర్ డ్యాంలో మరమ్మతులు చేపడుతున్నట్టు ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు నీటిని సరఫరా చేయడంలో రెగ్యులేటర్ డ్యాం కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. డ్యాంలోని ఎనిమిది గేట్లలో మూడు గేట్ల మరమ్మతు పనులు ప్రారంభించామని తెలిపారు. 1, 8 గేట్లు రోప్‌లు మారుస్తున్నామని, 4 గేటు రోలర్ మారుస్తున్నామని చెప్పారు. ఈ గేట్ల మరమ్మతులకు రూ.5లక్షల వ్యయం అవుతుందన్నారు. మరమ్మతులు పూర్తయితే నీటి సరఫరా సక్రమంగా అందడంతో విద్యుత్ ఉత్పత్తి సకాలంలో జరుగుతుందన్నారు. సీలేరు విద్యుత్ కాంప్లెక్సులో జోలాపుట్టులో 19.1 టీఎంసీలు, బలిమెలలో 35.3టీఎంసీలు, సీలేరులో 0.58 టీఎంసీలు, డొంకరాయిలో 10టీఎంసీల నీరు ఉందని చెప్పారు. బలిమెలలో ఏపీ వాటా కింద 29.99 టీఎంసీలు ఉండగా సీలేరు కాంప్లెక్సులో 40.57 టీఎంసీలు ఉందన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఏపీ, ఒడిశా సరిహద్దులో కురుస్తున్న వర్షాలకు జలాశయాల్లోకి వరద నీరు చేరుతోందని చెప్పారు. జోలాపుట్టులోకి ఇన్‌ఫ్లో 2,053 క్యూసెక్కులు కాగా, 78 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు చెప్పారు. బలిమెలో ఇన్‌ఫ్లో 5,573 క్యూసెక్కులు కాగా, అవుట్‌ఫ్లో 2,795, సీలేరులో ఇన్‌ఫ్లో 1,689 క్యూసెక్కులు కాగా, అవుట్‌ఫ్లో 965 క్యూసెక్కులు, డొంకరాయిలో ఇన్‌ఫ్లో 2,728 క్యూసెక్కులు కాగా, అవుట్‌ఫ్లో 3,865 క్యూసెక్కులు, ఏపీపీ డ్యాంలో ఇన్‌ఫ్లో 3,817 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 3879 క్యూసెక్కులని ఆయన తెలిపారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు



రంపచోడవరంలో వైఎస్సార్ చేయూత చెక్కు అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, పీవో సూరజ్ గనోరే తదితరులు

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని మంగళవారం వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని 948 మంది లబ్ధిదారులకు రూ.5.58కోట్లు వైఎస్సార్ చేయూత ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో చిరు వ్యాపారాలు ప్రారంభించి మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ముందుగా జి.కె.వీధి ఎంపీపీ బోయిన కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చెంతకే పథకాలు అందేలా చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారన్నారు. వైఎస్సార్ చేయూత పథకంలో అత్యధికంగా చింతపల్లి మండలానికి 3,768 మందికి రూ.7.60కోట్లు అర్హులైన లబ్ధిదారులకు అందించినట్టు చెప్పారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులు, వెలుగు సిబ్బంది తదితరులు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ చేయూత కార్యక్రమంతో వేలాది మంది మహిళలు పాల్గొని జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. సర్పంచులు సుభద్ర, రామకృష్ణ, విజయకుమారి, కాసులమ్మ, లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ వి.ప్రసాద్, కో-ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే దావీద్, ఎంపీటీసీ సభ్యులు నాగమణి, రమణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంపీడీవో ఉమామహేష్, తహసీల్దార్ రాజుకుమార్, ఏపీఎం రాంప్రసాద్, మల్లేశ్వరరావు, ఏవో మధుసూదన్, ఈవోపీఆర్డీ పాపారావు, నేతలు అరుణ్ కుమార్, ప్రసాద్, అంజి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని గిరిజన మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. రంపచోడవరం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం జరిగిన మూడో విడత వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమల్లోకి తీసుకొచ్చారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశారన్నారు. గ్రామ వలంటీర్ వ్యవస్థతో లబ్ధిదారుల చెంతకే పథకాలు అందుతున్నాయన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా ఏజెన్సీలో 20వేల మందికి పైగా గిరిజనులకు 48,370 ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారిస్తున్నామన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సుపరిపాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అనేక సేవలందుతున్నాయన్నారు. గ్రామ సచివాయాల్లో అన్ని రకాల ధ్రువపత్రాలు పొందే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల ఆధార్‌కార్డులో మార్పుచేర్పులకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఏజెన్సీ 11 మండలాల్లో 72,174 మంది మహిళలకు రూ. 135.31 కోట్లు చేయూత ద్వారా మంజూరైనట్టు తెలిపారు. దేవీపట్నం, రంపచోడవరం, మారేడుమిల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు వైఎస్సార్ చేయూత చెక్కును అందజేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, దేవీపట్నం ఎంపీపీ కుంజం మురళీ, సత్యవేణి, బేబి రత్నం, వైఎస్ ఎంపీపీలు బాలకృష్ణ, కుమారి, సర్పంచ్‌లు బొజ్జయ్య,ప్రసాద్, ఎంపీటీసీలు వెంకటేశ్వర్లుదొర, వంశీ, లక్ష్మి ఏపీడీ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన గిరిజన మహిళలు, ప్రజా ప్రతినిధులు

పక్కాగా పంట లెక్క

- ఈ-కేవైసీ, ఈ-క్రాప్ నమోదుతో రైతుకు మేలు
- జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్. నంద్



ఈ-క్రాప్‌లో పంట వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: జిల్లా వాప్తంగా పంటల సాగు గతేడాది కంటే ఆశాజనకంగా ఉంది. వాతావరణం అనుకూలించడంతో పాటు సకాలంలో సాగు పెట్టుబడి సొమ్మును రైతు భరోసా ద్వారా ప్రభుత్వం చెల్లించడం, విత్తనాలు అందజేయడంతో వివిధ రకాల పంటల విస్తీర్ణం బాగా పెరిగింది. ప్రభుత్వం అన్నదాతకు అండగా ఉంటూ అన్ని విధాలుగా ఆదుకుంటుంది. రైతుకు ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ చేపట్టింది. దీంతో ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటకు నష్టం జరిగితే ప్రభుత్వం సహకారం అందిస్తోంది. ప్రభుత్వ పథకాలు పొందే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 2,14,988.98 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నట్టు ఈ-క్రాప్ నమోదు ద్వారా తెలిసినట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నంద్ చెబుతున్నారు. ప్రతి రైతు ఈ-కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు జిల్లాలో 15వేల మంది రైతులకు పూర్తయినట్టు చెప్పారు. ఈ-కేవైసీ కోసం రైతు భరోసా కేంద్రంలో గాని, వ్యవసాయ సహాయకుడు సహాయం పొందాలని ఆయన సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతు, పంటల వివరాలు సేకరించి ఈ-క్రాప్‌లో నమోదు చేస్తున్నారని చెప్పారు. ప్రతి రైతు అధికారులకు సహకరించి ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఈ-క్రాప్ ప్రయోజనాలు

ఈ-క్రాపు నమోదు ద్వారా సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, సరఫరా, వైఎస్సార్ భరోసా ద్వారా రైతుకు పెట్టుబడి సాయం, పంట రుణాలు, వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ, ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టానికి పరిహారం అందజేయడం, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, పంటలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించుకునే వెసులుబాటు తదితర లాభాలు ఉన్నట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నంద్ చెప్పారు.

జిల్లాలో ఈ-క్రాప్ నమోదు వివరాలు

జిల్లాలోని 22 మండలాల్లో వరి తదితర పంటల సాధారణ సాగు విస్తీర్ణం 3,00,615.99 ఎకరాలు కాగా ఈ-క్రాపు బుకింగ్ 2,14,988.98 ఎకరాల్లో పూర్తయ్యినట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నందో చెప్పారు. ఉద్యావనవనపంటల సాధారణ సాగు విస్తీర్ణం 87,049.46 ఎకరాలు కాగా, 65,336.52 ఎకరాల్లో ఈ-క్రాపు నమోదైనట్టు తెలిపారు. మరో 70 ఎకరాల్లో పట్టు సాగు జరుగుతోందని, 40 శాతం నమోదైనట్టు పేర్కొన్నారు.

అన్నదాతకు ప్రభుత్వం అండ



గంట ఎంత విస్తీర్ణంలో పంట ఉంది.. ఎంత మేరకు దిగుబడి వచ్చిందనే వివరాలు పక్కాగా ఉండేవి కాదు. ఇప్పుడు పంట చేతికి రాగానే వ్యవసాయాధికారులు పంటకోత ప్రయోగం చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే పంట నష్టపరిహారం ఇస్తున్నారు. రైతు భరోసా, పీఎం కిసాన్ యోజన పథకాలతో పాటుఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు పొందేందుకు ఈ-క్రాప్, ఈ కేవైసీ నమోదు తప్పనిసరి అని తెలుసుకొంటున్నాము. దీని వల్ల ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు పక్కదోవ పట్టవు అన్న ధీమా కలుగుతోంది. అన్నదాతకు ప్రభుత్వం అండగా నిలవడం ఆనందంగా ఉంది.

–దుశ్శరి వెంకటేశ్వర్లు, ముంజవరప్పాడు, రాజవొమ్మంగి మండలం

ఈ-క్రాప్ రైతు హక్కు



ఈ-క్రాప్ ప్రతి రైతు నమోదు చేయించుకోవాలి. తద్వారా రైతు తాను పండించిన పంటపై పూర్తి హక్కు ఉంటుంది. ప్రభుత్వ రాయితీలు నేరుగా పొందుతాడు. ఈ-క్రాప్ నమోదు ద్వారా కౌలు రైతుకు కూడా తాను పండించిన పంటపై పూర్తి హక్కు కలిగి ఉంటాడు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు భూమి గల ఆసామికి కాకుండా దుక్కిదున్ని పంట పండించిన రైతుకే దక్కుతాయి.

– ఎస్.బి.ఎస్.నంద్, అల్లూరి జిల్లా వ్యవసాయాధికారి

గంజాయి స్వాధీనం: నలుగురు అరెస్ట్

రాజవొమ్మంగి: మండలంలోని బోయపాడు సెంటర్లో తచ్చాడుతున్న నలుగురు వ్యక్తులను 60 కిలోల గంజాయితో పాటు రాజవొమ్మంగి ఎస్ఐ గోపీ నరేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. ఈ గంజాయి విలువ రూ.1.20 లక్షలు వుంటుందని ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన వ్యక్తుల్లో ద్వారపూడికి చెందిన వీరవెంకట సత్యనారాయణ, దమకేశ్వరుడు, చింతపల్లి ఏరియాకు సంబంధించిన రాజు, జగదీష్ ఉన్నారు. వీరి నుంచి ఒక మోటారు సైకిల్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఈ గంజాయి కొయ్యూరు మండలం దొడ్డవరం నుంచి విజయవాడ వైపు వెళుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచామన్నారు. ఇన్‌చార్జ్ సీఐ (అడ్డతీగల) వై. రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

18 కేజీలు..

దేవరాపల్లి: ఏజెన్సీ నుంచి అక్రమంగా తలిస్తున్న 18 కేజీల గంజాయిని దేవరాపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవరాపల్లి శారదానదిపై వంతెన వద్ద సోమవారం సాయంత్రం ఏఎస్ఐ పి. జమ్ములు తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తుండగా వాలాబు వైపు నుంచి వచ్చిన ఆటో డ్రైవర్ పోలీసులను చూసి వెనక్కి వెళ్లిపోయేందుకు ప్రయత్నించారు. అనుమానంతో పట్టుకునేందుకు ప్రయత్నించగా ఆటోని విడిచి పెట్టి ఆటో డ్రైవర్ పరారయ్యాడు. దీంతో ఆటోను తనిఖీ చేయగా 18 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.36 వేలు ఉంటుందన్నారు. ఆటోతో పాటు గంజాయిని సీజ్ చేశామన్నారు. సోమవారం రాత్రి కేసు నమోదు చేసి పరారైన ఆటో డ్రైవర్ కోసం గాలిస్తున్నామని ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు.

కాకరపాడు పాఠశాలలో మోటారు చోరీ

పోలీసులకు హెచ్ఎం ఫిర్యాదు

కొయ్యూరు: చీడిపాలెం పంచాయతీ కాకరపాడు మండల పరిషత్ పాఠశాల నాడు-నేడులో ఏర్పాటు చేసేందుకు తీసుకువచ్చిన మోటారు చోరీకి గురైంది. దీనిపై పాఠశాల హెచ్ఎం కె.రాజు మంగళవారం కొయ్యూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాల తలుపులను పగులగొట్టి గదిలో ఉంచిన మోటారును సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోయారని ఆయన తెలిపారు. మనబడి నాడు నేడు పనులు జరగడంతో విద్యార్థులు తాగునీటి సమస్య తీర్చేందుకు వీలుగా ఏర్పాటు చేసేందుకు తెచ్చిన మోటారు పోయిందని చెప్పారు.

ఆచూకీ తెలిస్తే చెప్పండి...



రాంబిల్లి: కొత్తూరుకు చెందిన మట్టా సూకరత్నం (45) అదృశ్యమైనట్టు కుమారులు గణేష్, సాయి తెలిపారు. ఈ నెల 23 నుంచి తమ తల్లి కనిపించడం లేదని వారు పేర్కొన్నారు. దీనిపై రాంబిల్లి పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. తమ తల్లి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే రాంబిల్లి పోలీసులకు గానీ లేదా తమ ఫోన్ నంబర్లు 8309553770 , 8978839473 గానీ తెలియజేయాలని గణేష్ కోరారు.

మానవత్వం చాటుకున్న వైద్యుడు

డెంగ్యూతో బాధపడుతున్న బాలుడికి ఉచిత చికిత్స



అనిల్‌ను పరీక్షిస్తున్న డాక్టర్ మల్లికార్జునరావు

కొయ్యూరు: నర్సీపట్నానికి చెందిన ఉమానారాయణ ఆస్పత్రి వైద్యుడు పి.మల్లికార్జునరావు మానవత్వాన్ని చాటుకున్నారు. డెంగ్యూతో తీవ్ర అస్వస్థతకు గురై, పరిస్థితి విషంగా ఉన్న గిరిజన బాలుడికి సకాలంలో ఉచితంగా వైద్యసేవలు అందించి ప్రాణాలు కాపాడారు. మండలంలో గదబపాలెం పంచాయతీ కొత్తూరుకు చెందిన కొండపల్లి కుమార్ దంపతుల నాలుగేళ్ల కుమారుడు అనిల్ డెంగ్యూతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆర్థిక పరిస్థితి కారణంగా ప్రైవేట్ వైద్యుని వద్ద చికిత్స చేయించలేక అనిల్‌ను కేజీహెచ్‌కు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతుండగా అల్లూరి యువ గిరిజన సేవా సంఘం నేత టి.మల్లేష్ సమాచారం తెలుసుకుని వారిని ఉమా నారాయణ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆ కుటుంబం పేదరికాన్ని వైద్యులు మల్లికార్జునరావుకు వివరించారు.దీంతో ఆయన ఉచితంగా వైద్యం సేవలందించి అనిల్ ప్రాణాలు కాపాడారు.వినాయక ల్యాబ్ ఇన్‌చార్జి చిన్న కూడా ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మల్లికార్జునకు అనిల్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. అల్లూరి సేవా సంఘానికి చెందిన మల్లేష్‌ను పలువురు అభినందించారు.

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్

అరకులోయ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ, మహిళా డిగ్రీ కళాశాలల్లో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్, డాక్టర్ సీహెచ్.రామకృష్ణ మాట్లాడుతూ అరకుతో పాటు జిల్లాలో పర్యాటక రంగం ఎంతో అభివృద్ధి చెందుతుందని, పర్యాటక రంగం ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, అందిపుచ్చుకోవాలని సూచించారు. పర్యాటక అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా అవసరమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కె.పద్మలత, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ కొండబాబు, ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, విజయలక్ష్మి, అధ్యాపకులు కె.పుష్పరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులోకి ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలు



ట్యూబెక్టమీ శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

చింతపల్లి రూరల్: చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలు తొలిసారిగా ప్రారంభించినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ డి.మహేశ్వరరావు తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో ఆస్పత్రిలో ఇప్పటివరకు పురుషులకు మాత్రమే కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం గైనకాలజిస్టుల పర్యవేక్షణలో ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ మేరకు మంగళవారం ఆస్పత్రిలో నలుగురు మహిళలకు గైనికాలజిస్టులు డాక్టర్లు సుధాశారద, కీర్తిలు ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలు విజయవంతంగా చేశారన్నారు.

పిడుగుపాటుకు పది పశువులు మృతి

కాపరికి తీవ్ర గాయాలు



పిడుగుపాటుకు గురై మృతి చెందిన పశువులు

గూడెంకొత్తవీధి: మండలంలో మంగళవారం పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి పిడుగు పడి దోనుగుమ్ముల గ్రామంలో కొందరు గిరిజనులకు చెందిన పది దుక్కిటెడ్లు మృతి చెందగా పశువుల కాపరి గొల్లూరి నాగేశ్వరరావు అనే గిరిజనుడికి గాయాలయ్యాయి. దోనుగుమ్ముల ప్రాంతంలో పశువులను మేతకు అటవీ ప్రాంతానికి తీసుకెళ్లగా ఒక్కసారిగా భారీ వర్షం కురుస్తూ పిడుగుపడింది. ఈ సంఘటనలో పశువులు, మేకలు చెల్లాచెదురయ్యాయి. పది పశువులు మృతి చెందాయి. పశువుల కాపరి నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించి అత్యవసర వైద్య సేవల నిమిత్తం చింతపల్లి ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన పశువులకు నష్టపరిహారం అందించి ప్రభుత్వం తమకు ఆదుకోవాలని బాధిత గిరిజనులు కోరుతున్నారు.

బైక్ ఢీకొని కార్మికుడి మృతి



మృతి చెందిన రమేష్‌సింగ్

పాయకరావుపేట: కేశవరం గ్రామం వద్ద డెక్కన్ కంపెనీ సమీపంలో డెక్కన్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికుడు రమేష్‌సింగ్ రోడ్డుపై నడిచి వెళ్తుండగా అదే రోడ్డులో ఎదురుగా మోటారుసైకిల్‌పై వస్తున్న వ్యక్తి బలంగా ఢీ కొట్టాడు. దీంతో రమేష్‌సింగ్ రోడ్డుపై పడిపోవడంతో బలంగా తలకు దెబ్బ తగిలి మృతి చెందాడు. అతనిని బైకుతో ఢీకొట్టిన వ్యక్తి కూడా కిందపడి తీవ్రంగా గాయపడడంతో తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించినట్టు ఎస్ఐ ఎస్.రమేష్ తెలిపారు. క్షతగాత్రుడు తుని మార్కం ట్రాజుపేటకు చెందిన కీర్తి శ్రీను అని గుర్తించినట్టు తెలిపారు. మృతుడు రమేష్‌సింగ్‌ది పలామ (జార్ఖండ్) కదిలి గ్రామం అని తెలిసిందని, కంపెనీలో పనిచేస్తున్న సూపర్‌వైజర్ పి.ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రమేష్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ Open 10th ఓపెన్ స్కూలింగ్ Inter, Degree (All), PG (All), BBA, BCA, B.Li.Sc, MBA, MCA, M.Li.Sc, Diploma, B.Tech, M.Tech, Pharmacy, B.Ed, M.Ed, UGC. అప్రూవ్ యూనివర్సిటీల నుండి మరియు AU Degree, PG ఓపెన్ సిట్టింగ్ (Lateral entry), 100% Result. Ph : 83417 74299 [V-770441]

■ Nagarjuna Universityలో Online Degree, PG, PG Diploma Admissions జరుగుచున్నవి. Eligible for all Govt jobs. Last Date to Join 30th Sept. Ph : 79972 96796 [V-9696]

COACHING

■ GATE EXAM - 2023 / 2024 ONLINE Coaching With Study Material and Practice Tests. First 50 Students Will Get 50% Fees Discount. Vishwa estd.2005 by IIT Alumni. For Registrations. Contact : (044) 22501245, 63742 44262. [N-1168239]

Real Estate

FLAT FOR SALE

■ 2 B/R 1050 Sft Ready to Occupy North Facing (37 Lacs) Sivasakthi Nagar, Kommadi, Madhurawada. Cont : 98484 92948 [V- 770440]

■ కార్పొరేట్, గ్రామీణ, పర్యాటక, పారిశ్రామిక, వ్యాపార, సైనిక రంగాలలో అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం జంక్షన్‌కి అతి దగ్గరలో 18 లక్షలకే 1000 Sft. 2 BHK అపార్ట్‌మెంటు ఫ్లాట్ కలదు. ఫోన్ : 98667 70388 [V-770439]

■ 3 BHK 1840 Sft North Facing 1st Floor, Sft Price 4100/- at Kommadi, Madhurawada. Cont : 91773 68331, 81868 08531 [V- 562]

FOR SALE

■ 96 Sq.Yd House (Patta), 16yrs old, Vivekananda nagar, Old Dairy farm, Bldg plan Regularised GVMC 9340812526 [WB-31847]

LAND FOR SALE

■ అనకాపల్లి జిల్లా కోడూరు దగ్గర కొత్తగా రాబోతున్న ఆటో నగర్ దగ్గర 30 అ॥ రోడ్డు కలిగిన ఎకరా రెండు సెంట్లు భూమి అమ్మకమునకు కలదు. లంకెలపాలెం నుండి కూడా ఎనిమిది కిలోమీటర్లు వస్తుంది. 9666482298. [C-790213]

■ Pకొత్తవలస పెట్రోల్ బంకు ఎదురుగా దొరతోట వెళ్ళే తారు రోడ్డుకి ఆనుకొని కమర్షియల్ స్థలం 1000 గ॥ 400గ॥ E.F., Rs.30 వేలు గ॥. సంప్ర: 9989533457 [P-1144895]

PLOT FOR SALE

■ గుర్ల హైవేకి 300 మీటర్ల దూరంలో 100 గజాలు, రూ.5,00,000/-. కేవలం రూ.3,20,000/- చెల్లించి మిగతాది నెలకి రూ. 15,000/- చొప్పున కట్టుకోవచ్చు. ఫోన్: 91103 20789 [V-1495]

■ 300 Sqyds (LR.S Paid) S/W Corner Bit at Thagarapuvalasa for Sale. Good For Guest House Purpose. Per Sqyd 13,500/-, 900 Meaters to Highway. Ph : 98663 21992 [V- 1496]

■ 2లక్షలకే 100 చ॥గ॥ ఇంటి స్థలం ల్యాండ్ కన్వర్షన్‌తో దేవరాపల్లిలో కలవు. కొత్తవలస – అరకు హైవేకు సమీపంలో ప్లాట్స్ కలవు. ఫోన్ : 81215 32500 [V- 2284]

SITE FOR SALE

■ అగనంపూడి మెయిన్ రోడ్‌కి 1/2 కి.మీ.లో దూరంలో I.P.No.30/2009, East & North, 267 గజాలు, అతి తక్కువ రేటుకే అమ్మకం. ఫోన్ : 99596 37799 [V-3052]

TO - LET

■ To Let - 3bed rooms furniture house office / guest house. Pandurangapuram beach road. 2bed rooms furniture flat peda Wallatair residence / guest house. Cont Rentals. Ph : 98480 21023 [V- 562]

Services

ఆయుర్వేదం

■ బొల్లి, తెల్లమచ్చలు, సొరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితంగా ఇవ్వబడును. సంప్ర॥ 9603055647, 7995392747 [G-668]

ASTROLOGY

■ భారతీయ సుప్రసిద్ధ జ్యోతిష్యులు శ్రీ షిరిడి సాయి ఉపాసకులు, మీ సంపూర్ణ భవిష్యత్తు మరియు ఎటువంటి సమస్యలకైనా పరిష్కారం తెలుపగలరు. ఎండాడ, వైజాగ్. ఫోన్ : 72071 82880, 99851 28889 [V- 6417]

SEPTIC TANK CLEAN

■ శ్రీ బాలాజీ GVMC సెప్టిక్ క్లీనింగ్ హైటెక్ మిషన్‌తో ఇరుగు పొరుగు వారికి ఎటువంటి దుర్వాసన, అసౌకర్యం లేకుండా 5 ని॥ల్లో క్లీన్ చేయబడును. ఫోన్ : 90009 29977, 90009 93838 [V-1489]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 920]

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర ✆ 70358 70359 [B-471]

T.V. REPAIR

■ SVS TV రిపేర్స్ : 83677 16961 LED, LCD, A/C, వాషింగ్ మిషన్స్, ఫ్రిజ్, మైక్రోఓవెన్, మీ ఇంటి వద్దనే స్పాట్ రిపేర్ చేయబడును. 25 సం॥ Ex, 5 సం॥ వారంటీ కలదు. [V-791241]

■ 93901 94160 SK ఎలక్ట్రానిక్స్ Enggచే. మీ ఇంటి వద్దనే TV, LCD, LED, A/C, ఫ్రిజ్, వాషింగ్ మిషన్స్, మైక్రోఓవెన్, అన్ని కంపెనీలు రిపేరు చేయబడును. 5 సం॥లు వారంటీ. [V-5252]

Wanted

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉండి పార్ట్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 10,000– 15,000 వరకు సంపాదించే అవకాశం. ఫ్రీ బుక్‌లెట్ కొరకు. 9059509586 [G-782166]

■ ప్రముఖ సంస్థ నందు మార్కెటింగ్ చేయుటకు టీమ్‌లీడర్స్ & ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ M/F కావలెను P/F టైం. జీతం లేదా కమీషన్, అర్హత : ఇంటర్. సుశీల : 97014 34755, 94921 00150 [V-791242]

■ డైరెక్ట్ జాబ్స్ : ఆఫీస్ కొరకు రిసెప్షనిస్ట్, టెలీ కాలర్స్, కంప్యూటర్ ఆపరేటర్, డెలివరీ బాయ్స్, మేనేజర్, మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. జీతం : 15k to 25k. ఫోన్ : 90304 27839 [V-791781]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు 30సం॥పై బడిన స్త్రీ/పురు & రిటైర్డ్ / VRS కావలెను. అర్హత : డిగ్రీ. కొత్తవారికి ట్రైనింగ్ కలదు. F/P టైమ్. నో ఫీల్డ్ వర్క్. ఫోన్ : 93953 97277 [V-2396]

■ మింది, శీలానగర్, డాకుయార్డ్ వద్ద గొడౌన్స్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం : రూ.11,500/-. వయస్సు : 50 సం॥ల లోపు. ✆ : 97051 56111, 97051 56333 [R-219]

■ మీ ఇంటివద్దనే వుంటు మా కంపెని ఓల్డ్ రికార్డ్స్ చూసి న్యూ రికార్డ్స్ వ్రాయుటకు స్త్రీ/పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం:12000. ఫోన్: 8374272245 [G-1693]

■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటి వద్దనే ఉంటూ పార్ట్ టైమ్ 1గం॥ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. 7702473949 [G-781275]

■ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో వర్క్ చేయుటకు కార్గో సూపర్‌వైజర్స్, హౌస్‌కీపింగ్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్, లోడర్స్ అర్జెంట్‌గా కావలెను. జీ: 18,000/- to 30,000/-, Q: 5th to Any Degree రూం+భోజనం ఫ్రీ. 9642264336 [H-778903]

■ త్రివేణి హోంకేర్,హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్‌ను చూసుకోవడానికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K. ఏజెంట్ కమీషన్. 3K. Ph: 9848571888, 7569955551 [H-783642]

■ Bank Verification Requires "Field Executives" Basic Salary 12000+ Incentives+ Conveyance. Two Wheeler @ Smart Phone Madhurawada, Parvada, Chodawaram, Tagarapuvalsa, Gajuvaka, Mattipalem, Naval Dockyard, Pendhurthi, Simhachalam, Narsipatnam, Runi, Nakkapalli. Ph: 8499887181 [HA-90577]

■ VIP'sఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, RMP Dr, Q: 5th- డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూ ఫ్రీ, Hyd. 7995365999 [HA-503]

■ MUN ఆగ్రో సంస్థలో ఇంటి వద్ద నుండి పని చేయుటకు యువతి /యువకులు (పార్ట్/ఫుల్ టైమ్) కావలెను. అర్హత: 10th పైన, జీతం: 13-18 వేలు, Age: 18-35 సంప్ర: 9052304896. [C-790212]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!! సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

- అద్దెకు
- అమ్మకం
- రియల్ ఎస్టేట్
- ఫర్నీచర్స్
- ఆటోమొబైల్స్
- కంప్యూటర్స్
- సర్వీసెస్
- కావలెను

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.325/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

క్లుప్తంగా

సారా. గంజాయి నిర్మూలన అందరి బాధ్యత



కించుమండలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ దేముడుబాబు, గ్రామస్తులు

డుంబ్రిగుడ: సారా, గంజాయి నిర్మూలన అందరి బాధ్యత అని అరకులోయ సీఐ దేముడుబాబు అన్నారు. కించుమండ గ్రామంలో ఆయన మంగళవారం పర్యటించారు. గ్రామస్తులకు సారా, గంజాయి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సారా తయారీ, గంజాయి తయారీ, రవాణా నేరమని, దూరంగా ఉండాలని హితవుపలికారు. గంజాయికు స్వస్తి పలికి, వాణిజ్య పంటల సాగుపై గిరిజనులు దృష్టి సారించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, రుణ యాప్‌ల అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఐ సంతోష్‌కుమార్, సర్పంచ్ చెల్లమ్మ, బాబూరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా కిషోర్



మారేడుమిల్లి : మండల నూతన ఎంపీడీవోగా అర్లగడ్డ వీరా కిషోర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన మారేడుమిల్లి తొలి మండల ప్రజా పరిషత్ అధికారిగా విధులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటివరకు ఎంపీడీవోగా పనిచేసిన వివేక్ ఈవోపీఆర్డీగా యాథాస్థానంలో కొనసాగనున్నారు.

ఆత్మీయ సన్మానం



మురళీకృష్ణను సన్మానిస్తున్న బీఎం కృపానందం తదితరులు

గూడెంకొత్తవీధి : స్థానిక జీసీసీ మేనేజర్‌గా పనిచేసి విశాఖపట్నం కార్యాలయానికి బదిలీపై వెళ్తున్న మురళీకృష్ణను సహచర ఉద్యోగులు మంగళవారం ఘనంగా సన్మానించారు. బీఎం కృపానందం మాట్లాడుతూ జీకే వీధిలో జీసీసీ బలోపేతానికి మురళీకృష్ణ చేసిన సేవలు మరువలేనివన్నారు. జీసీసీ మరింత బలోపేతం కోసం అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. గొడౌన్ సూపరింటెండెంట్ కృష్ణారావు, సేల్స్‌మెన్‌లు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న జిల్లా వైద్య విధాన పరిషత్ కో-ఆర్డినేటర్ హరి

చింతపల్లి: మండల కేంద్రంలోని సీహెచ్‌సీని అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య విధాన పరిషత్ కో-ఆర్డినేటర్ ఎం.హరి మంగళవారం సందర్శించారు. ఆస్పత్రిలో సౌకర్యాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవల గురించి వారితో మాట్లాడి తెలుసుకొన్నారు. సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలందించాలని ఆయన సూచించారు. డిప్యూటీ సివిల్ సర్జన్ మహేశ్వరరావు, వైద్యాధికారులు పి.రఘురామ్, డి.హిమబిందు, జి.నరేష్ తదితరులున్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డాక్టర్ అబ్రహం, పాస్టర్లు

కూనవరం: ఇటీవల సంభవించిన గోదావరి వరదల్లో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు బియ్యం తదితర నిత్యావసర సరుకులను భద్రాచలం గుడ్ సమారిటన్ ఇవాంజికల్ లూథరన్ చర్చి ప్రతినిధులు అందజేశారు. పోచవరం కాలనీ కొనవరం, కూళ్లపాడు, దొంగుట్ట, నర్సింగపేట, గొందునూరు గ్రామాల్లోని 600 కుటుంబాలకు సంస్థ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ కల్వకూరి అబ్రహం చేతుల మీదుగా పంపిణీ చేశారు. రెవరెండ్ పి.జాన్సన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాస్టర్లు ఎస్.రమేష్, ఎస్.పున్నయ్య, ఎస్.యోహాన్, టి.మార్క్, సంఘ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



ప్రభుత్వ పథకాలపై గిరిజనులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని చింతపల్లి పంచాయతీ సచివాలయం-2 పరిధిలో కందులగాది, మల్లవరం, గడపరాయి, సచివాలయం-3 పరిధిలో పెంటపాడు గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 656 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు, పథకాల అమలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా, సకాలంలో అందుతున్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే వద్ద ఆనందం వ్యక్తం చేశారు. మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టేలా వైఎస్సార్‌సీపీకి పూర్తిస్థాయిలో మద్దతు తెలియజేస్తామన్నారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన, సంక్షేమ పథకాల అమలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల చెంతకే పాలన అందిస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. అర్హత ఉండి ఎవరికైనా పథకాలు అందకపోతే తమ దష్టికి తీసుకు రావాలని కోరారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, సర్పంచ్ పుష్పలత, కో-ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



రంపచోడవరంలో వైద్యశిబిరానికి వచ్చిన రోగులు

రాజవొమ్మంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్ వైద్యశిబిరంలో 140 మందికి సేవలు లభించాయి. రాజమహేంద్రవరంకు చెందిన జూపిటర్ ఆస్పత్రి ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు సందీప్, హీలియోస్ హాస్పిటల్ జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ నీలిమ రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణ శిబిరాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీదుర్గ, ఆరోగ్యశ్రీ టీం లీడర్ వంశీ, సిబ్బంది రాజుబాబు, సౌజన్య, రమాదేవి తదితరులున్నారు.



వె.రామవరం మండలం మునగలపూడిలో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

వె.రామవరం: ములగలపూడి, బూరుగుపాలెం, పులుసుమామిడి, వానమామిడిగొంది, మునసలపాలెం, యర్రంరెడ్డిపాలెం, నూగంటిపాలెం, కె.యర్రగొండ, రేగడిపాలెం, చందుర్తి, పెద్ద ఊలెంపాడు, దాలిపాడు, గుమ్మరిపాలెం గ్రామాల్లో లయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, ఆయుష్ శాఖ సహకారంతో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. సంస్థ ఏరియా కో-ఆర్డినేటర్ జి.బుల్లియ్య అధ్యక్షతన ఆయుష్ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వెంకట కృష్ణ అద్వర్యంలో 8 మంది వైద్యాధికారులు పాల్గొని బృందాలుగా విడిపోయి, ఆయా గ్రామాల్లో 475 మందికి రోగులకు వైద్య పరీక్షలుచేసి, ఉచితంగా మందులు అందజేశారు. వైద్యాధికారులు మహమ్మద్ ఆలి, మోహన్‌బాబు, పద్మజ, నీలిమ, నాగేంద్ర, మాలినాయక్, వాహినితో పాటు లయ సంస్థ ప్రతినిధులు తదితరులు సేవలందించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎమ్మెల్యే అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యవసర వైద్యం కోసం వచ్చిన రోగులపట్ల శ్రద్ధ తీసుకొని మెరుగైన చికిత్స అందించాలని సిబ్బందికి సూచించారు. సాధ్యమైనంత వరకు కేసులు రిఫర్ చేయకుండా ఇక్కడే వైద్య సేవలు అందించాలన్నారు. ఆస్పత్రిలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, ఆస్పత్రి కమిటీ సభ్యులు రూతు, తమన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



పౌష్టికాహార పదార్థాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో, జెడ్పీటీసీ సభ్యుడు తదితరులు

అనంతగిరి: మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీడీపీవో సంతోషికుమారి మంగళవారం నిర్వహించిన పోషకాహార మాసోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీడీవో శ్రీహర్షిత్, జెడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ రూతు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పోషకాహారంతోనే ఆరోగ్యం కలుగుతుందని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అమృతహస్తం, బాలామృతం, వైఎస్సార్ బాలసంజీవిని గిరిజనులకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. అంగనవాడీ కేంద్రాల్లో అమలయ్యే ఆహార పదార్థాలను స్టాల్స్ ఏర్పాటుచేసి ప్రదర్శించారు. సూపర్‌వైజర్ శాంతి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

నేటి 'గడప గడప'కు వాయిదా

గంగవరం: మొల్లేరు పంచాయతీ ఆర్డీ పురం, వడ్డి చెరువు గ్రామాల్లో బుధవారం జరగాల్సిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం వాయిదా పడినట్టు ఎంపీడీవో బి.శ్రీనివాసులు తెలిపారు. తాడేపల్లిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించే ఎమ్మెల్యేల సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే ధనలక్ష్మి హాజరుకావలసి ఉండడంతో కార్యక్రమాలను వాయిదా వేసినట్టు మండల పార్టీ ఇన్‌చార్జి రఘునాథ్ తెలిపారు.

నిబద్ధతగా పనిచేయాలి



గ్రామవలంటీర్లకు నియామకపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

గంగవరం: ఎంపీడీవో బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సచివాలయ కార్యదర్శులు, గ్రామ వలంటీర్లతో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబిరత్నం మంగళవారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా కార్యదర్శులు, గ్రామ వలంటీర్లు పనిచేయాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు. తహసీల్దార్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఈ-క్రాప్, ఈకేవైసీని వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏవో విశ్వనాథ్ మాట్లాడుతూ నిబద్ధతగా పనిచేయాలని సూచించారు. మండలంలో ఖాళీగా ఉన్న గ్రామవలంటీర్ల పోస్టులకు భర్తీ చేసిన అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేశారు. ఉద్యానవన శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించకుంటే చర్యలు

చింతూరు: మండల కేంద్రంలోని డ్రైనేజీలపై నిర్మించిన ఆక్రమణలను వెంటనే తొలగించాలని లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రవిబాబు, పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించిన దుకాణదారులకు మంగళవారం నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో అక్రమ నిర్మాణాలను తొలగించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

జి.మాడుగుల: జోగులపుట్టులో జరుగుతున్న రోడ్డు పనులను మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాంబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండంనాయుడు మంగళవారం పరిశీలించారు.

సంతకు దసరా కళ

- నాటుకోళ్లు, గొర్రెలు, మేకలకు డిమాండ్
- జోరుగా వ్యాపారం



వారపుసంతలో విక్రయించటానికి తీసుకొచ్చిన నాటు కోడి పుంజులు



విక్రయిస్తున్న గొర్రెలు,మేకలు

జి.మాడుగుల/డుంబ్రిగుడ: దసరా సమీపిస్తుండంతో సంతలకు పండగ కళ సంతరించుకుంది. అల్లూరి జిల్లాలో జరిగే వారపు సంతల్లో నాటుకోళ్లు, మేకలు, గొర్రెలు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. జి.మాడుగుల మండం సంతబయలు, డుంబ్రిగుడతో పాటు ఇతర ప్రాంతాల్లో సంతల్లో మేకలు, గొర్రెలు, నాటుకోళ్లకు డిమాండ్ నెలకొంది. ధరలు కూడా గతంలో కంటే ఎక్కువగా ఉన్నాయి. పెంపకందార్లు చెప్పినా ధరలకు వినియోగదారులు, వ్యాపారులు అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేశారు. సంతల్లో ఇవి హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. రానున్న రోజుల్లో ధరలు మరింతగా పెరిగే అవకాశాలుండడంతో ముందుగానే కొనుగోళ్లు చేస్తున్నారు. విజయదశమి పురస్కరించుకొని వాహనాలు, ఆయుధాలు, యంత్రాలకు పూజలు చేయటం అనవాయితీ. ఏజెన్సీలో జరుగుతున్న వారపు సంతలో నాటుకోళ్లు, మేకలు,గొర్రెల పెంపకందారులకు మార్కెట్‌లుగా మారాయి. మైదాన ప్రాంతాల్లో నాటుకోళ్లు, మేకలు, గొర్రెలకు గిరాకీ ఉండడంతో దళారులు, వ్యాపారులు సంతల్లో కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు తరలించి, రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. జి.మాడుగుల సంతబయలు సంతలో కిలో నాటుకోడి రూ.800 నుంచి రూ.900. 10కిలోల మేక, గొర్రెలు రూ.10,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. ఇదిలా ఉండగా డుంబ్రిగుడలో ఒక్కో మేక రూ.10 వేల నుంచి రూ.18వేల వరకు ధరకు విక్రయాలు జరిగింది.నాటుకోడి సైజును బట్టి రూ.800 నుంచి రూ.1600 వరకు విక్రయాలు జరిగాయి. ఏజెన్సీలోని సంతల్లో రానున్న వారంరోజుల్లో గొర్రెలు, మేకలు, కోళ్ల వ్యాపారం కోట్లాది రూపాయల్లో జరగనున్నట్టు పలువురు చెబుతున్నారు.

సమస్యలు తెలుసుకుంటూ.. పథకాలు వివరిస్తూ



రామన్నపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి
- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

దేవీపట్నం: మండలంలోని వి.రామన్నపాలెం గ్రామ సచివాయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి అనుహ్య స్పందన లభించింది. రాయవరం, దామనపల్లి, వెలగపల్లి, గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగుపల్లి ధనలక్ష్మి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో 209 గడపలను సందర్శించి, ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజలు చెప్పిన సమస్యలును వింటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగలక్ష్మి మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హత ఉండి కూడా ఇప్పటికి సంక్షేమ పథకాలు అందని వారి వివరాలను సేకరించి వెంటనే సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు సత్యవేణి, వైస్ ఎంపీపీ మురళీకృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

లంపి వ్యాధి నివారణకు చర్యలు



పశువుకు లంపి వ్యాధి టీకాలు వేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: కుమడ పంచాయతీ కేంద్రంలో పశువైద్యాధికారి భాస్కరరావు ఆధ్వర్యంలో 117 పశువులకు లంపి వ్యాధి నివారణ టీకాలు వేశారు. కుమడ, కొత్తసుజనకోట గ్రామాల్లో పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించి పశువ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు.లంపి వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. జెవిల్‌వో యమున, సిబ్బంది ఉన్నారు.

డుంబ్రిగుడ: గుంటసీమ, కోల్లాపుట్టు పంచాయతీల్లో నిర్వహించిన పశువైద్య శిబిరంలో 412 పశువులకు లంపి వ్యాధి నివారణ టీకాలు వేసినట్టు పశు వైద్యాధికారులు గౌతమ్, శీనయ్య, గణేష్ చెప్పారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: కొరవంగి పంచాయతీలో మంగళవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో 25 పశువులకు లంపి వ్యాధి నివారణ టీకా, 60 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు అందజేసినట్టు పశు వైద్య సిబ్బంది సన్నిబాబు చెప్పారు. పశుమిత్ర మన్మథరావు తదితరులున్నారు.

నాడు-నేడు పనులకు భూమిపూజ



పనులకు భూమిపూజ చేసిన ప్రజాప్రతినిధులు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి, విద్యానగర్, శాంతినగర్‌లలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నాడు-నేడు పనులకు ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి, మండల పార్టీ కన్వీనర్ రామకృష్ణ తదితరులు మంగళవారం భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయన్నారు. వైస్ ఎంపీపీలు చంద్రరాణి, రాజేశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు గంగదుర్గ, నాయకులు వెంకటేష్‌రాజు, తాతారావు, శాంతకుమారి, జాన్‌బాబు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



చింతపల్లిలో దుర్గాదేవికి భక్తులతో కలిసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి రూరల్/సీలేరు/పెదబయలు/గంగవరం/అడ్డతీగల: శరన్నవరాత్రులు పురస్కరించుకుని మంగళవారం దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కనకదుర్గమ్మ ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. గాయత్రిదేవి అలంకరణలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. చింతపల్లి మండల కేంద్రంలోని దుర్గాదేవి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి భక్తులతో కలిసి ప్రత్యేక పూజలుచేశారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

పక్షోత్సవ కార్యక్రమాలపై అవగాహన

రాజవొమ్మంగి: వైఎస్సార్ క్రాంతి పథం రాజవొమ్మంగి మండల మహిళా సమాఖ్య లీడర్ల సమావేశం మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో జరిగింది. ఈనెల 26వ తేదీ నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు నిర్వహించాల్సిన పక్షోత్సవ కార్యక్రమాలపై ఏపీఎం ఆదినారాయణ మహిళ సంఘాల లీడర్లకు అవగాహన కల్పించారు.

వరలక్ష్మి నియామకంపై హర్షం

రాజవొమ్మంగి: వైఎస్సార్ క్రాంతి పథం జిల్లా సమాఖ్య ఉపాధ్యక్షురాలిగా రాజవొమ్మంగి ఎంఎంఎస్ అధ్యక్షురాలు కొనకం వరలక్ష్మి ఎంపికవడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. పాడేరులో జరిగిన 22 మండలాల మండల మహిళా సమాఖ్యల సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ప్రెసిడెంట్‌గా సీహెచ్.సీత, ఉపాధ్యక్షురాలిగా వరలక్ష్మి, కార్యదర్శిగా వీరయమ్మ, జాయింట్ సెక్రటరీగా రమణ, కోశాధికారిగా కాంతం ఎన్నికయ్యారు.

ఆధార్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గంగవరం : లక్కొండ కేంద్రంలో ప్రత్యేక ఆధార్ సెంటర్ ప్రారంభించనున్నామని, సేవలను ఉచితంగా పొందవచ్చునన్నారు. జడేరు, నెల్లిపూడి, మొల్లేరు గ్రామాల్లో కొత్తగా ఆధార్ సెంటర్లు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎంపీడీవో వివరించారు.

ఆస్పత్రుల కార్మికుల నిరసన

పాడేరు రూరల్ : వివిధ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎల్.సుందర్‌రావు డిమాండ్ చేశారు. జిల్లా ఆస్పత్రి వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండ్‌కు వినతిపత్రం అందజేశారు.

Dr. PAUL RAJ ENGINEERING COLLEGE
(Affiliated to JNTUK, Kakinada & Approved by AICTE, New Delhi)
Laxmidevipeta (V), Yetapaka (Post & Mdl), Alluri Seetharamaraju (Dist.), A.P. Phone: 9848042481, 9494180808, Email: principal@dprec.ac.in

Admission Notification for B.Tech. Category - B Seats

Applications are invited for Category - B seats for the Academic Year - 2022 - 23.

B.Tech.	CSE	ECE	EEE	ME	CE
Category - B Seats	18	18	18	18	18

Interested candidates can submit the application through online or in person before **10-10-2022** on any working day and Tuition fee is Rs. 70,000/-.
Admission will be done as per the guidelines of APSCHE that are in vogue.

Sd/- **Principal**

అనారోగ్యంతో ఏఎన్ఎం మృతి

మారేడుమిల్లి: మండలంలోని తాడేపల్లి గ్రామ ఏఎన్ఎంగా పనిచేస్తున్న కత్తుల సన్యాసమ్మ(38) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో భాదపడుతున్న ఆమె రాజమహేంద్రవం ఆసుపత్రికి తరలించగా, అక్కడ నుంచి కాకినాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రంపచోడవరం చాంపియన్స్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను వైఎస్సార్‌సీపీ మండల యూత్ ప్రెసిడెంట్ రాపాక సుధీర్, ఎంపీటీసీ కుంజం వంశీ మంగళవారం ప్రారంభించారు. నాలుగురోజుల పాటు జరగనున్న పోటీల్లో 11 మండలాల నుంచి 52 టీమ్‌లు పాల్గొన్నాయని రామారావు, సుధాకర్, రవిచంద్ర తెలిపారు.

నిలిచిన లారీ: స్తంభించిన ట్రాఫిక్

అనంతగిరి: విశాఖపట్నం నుంచి అరకులోయ వైపు తారు లోడుతో వెళుతున్న లారీ డముకు సమీపంలో మలుపువద్ద మంగళవారం మధ్యాహ్నం రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో బస్సులు, లారీల రాకపోకలు రెండు గంటలపాటు నిలిచిపోయాయి. అనంతరం లారీను పక్కకు తీశారు. పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు.

డిగ్రీ కాలేజీలో అతిథి ఉపన్యాసం

చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం హిందీభాష ప్రాధాన్యత అనే అంశంపై హిందీ విభాగం ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దక్షిణ భారత హిందీ ప్రచార సభ మద్రాస్ అకాడమిక్ కౌన్సిలర్ సభ్యుడు రాజారావు మాట్లాడుతూ హిందీభాష సులువుగా నేర్చుకోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నమాణిక్యం, హిందీ అధ్యాపకురాలు శైలజ తదితరులున్నారు.

వైఎస్సార్ చేయూత కార్యక్రమం రేపటికి వాయిదా

కొయ్యూరు: వైఎస్సార్ చేయూత కార్యక్రమం 29వ తేదీకి వాయిదా పడిందని ఎంపీడీవో మేరీరోజ్ మంగళవారం తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అత్యవసర పని నిమిత్తం బుధవారం నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని గురువారం వాయిదా వేశామని, లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు. అనంతరం గడపగడపకు కార్యక్రమం ఉంటుందన్నారు

తాగునీటి సమస్యకు పరిష్కారం

కొయ్యూరు: సింగవరంలో ఐటీడీఏ కాలనీతో పాటు వేరు ప్రాంతలో జల్‌జీవన్ మిషన్ ద్వారా రెండు బోర్‌వెల్స్ ఏర్పాటు పనులను సర్పంచ్ సోమన్నదొర మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కానుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పాడేరు డివిజన్:
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com